క్లుప్తంగా

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

సత్యవేడు: మహాత్మాగాంధీ జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలో(బాలురు) 5వ తరగతిలో చేరేందుకు ప్రవేశ పరీక్ష ఆదివారం నిర్వహించారు. డిపార్టుమెంట్ అధికారి అనూష, ఎం.సత్యనారాయణ పరీక్షలను పర్యవేక్షించారు. 34 మంది దరఖాస్తు చేసుకోగా 25 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

భక్తులకు అన్నదానం


అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని పీవీరోడ్డులో వెలసిన అంకమ్మ ఆలయం వద్ద ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడేళ్లుగా ప్రతి అమావాస్యకు భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోవర్ధన్ రావు, యశ్వంత్‌రావు, లోకేష్‌యాదవ్, శివకుమార్‌రెడ్డి, క్రాంతికుమార్, డాక్టర్ కపానిధి, ఉపేందర్‌రెడ్డి, రాఘవేంద్ర, గణేష్‌బాబు, వినీత్‌రెడ్డి, నాగేష్, వెంకటసుబ్బయ్య, సత్యనారాయణ, చక్రధర్, దినకర్, మాధవ, సాయి, కృష్ణప్రియ, కల్పన, జ్ఞానప్రసూన, అనూష, షరిమళ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుళ్లకు ఘన సన్మానం


బదిలీ అయిన కానిస్టేబుళ్లతో ఎస్ఐ

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక పోలీసుస్టేషన్‌లో పని చేస్తూ బదిలీ అయిన కానిస్టేబుళ్లు ప్రభాకర్, రేగస్, శరత్‌కుమార్, అరుణకుమార్, నమోరంగ, నరేష్‌ను ఆదివారం ఎస్ఐ విశ్వనాథనాయుడు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదుగురు కానిస్టేబుళ్లకు ఐదేళ్ల సర్వీసు పూర్తి కావడంతో నిబంధనల ప్రకారం బదిలీ అయ్యారని తెలిపారు. వీరంతా విధులను సక్రమంగా నిర్వర్తించి, ప్రజల్లో మంచి పేరు సంపాదించుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు


ప్రత్యేక అలంకరణలో సొరకాయలస్వామి

నారాయణవనం: మండలంలోని పలు ఆలయాలలో ఆదివారం అమావాస్య పూజలు నిర్వహించారు. సొరకాయల స్వామి ఆలయంలో ఉదయం మూలవర్లకు ప్రత్యేక అభిషేకాలు చేపట్టి, సుగంధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాదాలను వితరణ చేశారు. తమిళనాడు నుంచి అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలను అందుకున్నారు. అలాగే వీరరాఘవస్వామి దేవస్థానంలో మధ్యాహ్నం జరిగిన అమావాస్య పూజల్లో మహిళలు, భక్తులు పాల్గొన్నారు. కైలాసనాథకోనలోని శివశక్తి, శాంతి ఆశ్రమాలలో అమావాస్య పూజలు నిర్వహించారు. భక్తులు, పర్యాటకులు ఆశ్రమాలలో జరిగిన అన్నదాన కార్యక్రమాలలో పాల్గొన్నారు.

నాగలాపురంలో..


ఊంజల్‌సేవలో రామగిరి అంకాలమ్మ

నాగలాపురం: పిచ్చాటూరు మండలం రామగిరిలో వెలసిన శ్రీ అంకాల పరమేశ్వరి ఆలయంలో ఆదివారం అమావాస్య పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం 7 గంటలకు ఆలయంలోని అమ్మవారి మూలవిరాట్‌కు ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం ఊంజల్ మండపంలో అమ్మవారి ఉత్సవమూర్తిని అధిష్టించి వివిధ రకాల పుష్పాలతో ఉగ్రరూపిణిగా అలంకరించి ఊంజల్ సేవ నిర్వహించారు. అర్ధరాత్రి 12 గంటల వరకు భక్తులు అమ్మవారి భజనలతో నాట్యం చేస్తూ తన్మయత్వం పొందారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం అమావాస్య రావడంతో ఆలయంలో నిర్వహించే పూజలకు భక్తులు పోటెత్తారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నివాళి

ఏర్పేడు (రేణిగుంట): ఏర్పేడు మండలం గుండ్లకండ్రిగ గ్రామ సర్పంచ్ జయముని తల్లి కలవగుంట నర్మద అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలిసి మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి అత్త సామాను అనసూయమ్మ గ్రామానికి వెళ్లి నర్మద మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారి వెంట గున్నేరి కిషోర్ రెడ్డి, గుండయ్య, రాజా, వేణు, మధు, లోకనాథం, జ్ఞానప్రకాష్ యాదవ్ తదితరులు ఉన్నారు.

ఖరీఫ్ సీజన్..ఏరువాక సాగెన్..


జీఎన్‌కండ్రిగ గ్రామంలో వరి నాటుతున్న మహిళా కూలీలు

బుచ్చినాయుడుకండ్రిగ మండలవ్యాప్తంగా అన్నదాతలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ముఖ్యంగా ఆర్.అనంతాపురం, జీఎన్‌కండ్రిగ, జంబుగోళం, వేణుగోపాలపురం, నెలవాయి, వేణుగోపాలపురం, కల్లివెట్టు, తలారివెట్టు, వెస్టువరత్తూరు, చిన్నపాలేడు, పెద్దపాలేడు, గ్రామాల్లో ఎక్కువగా వరి సాగు అవుతోంది. ఖరీఫ్ సీజన్ కావడంతో రైతులు పొలాలను దుక్కులు చేసి సుమారు 1200 ఎకరాల్లో వరినాట్లు వేస్తున్నారు. కూలీలకు చేతినిండా పని దొరుకుతోంది. బోర్లు, బావుల్లో నీరు ఉన్న వారితో పాటు చెరువుల నిండా తెలుగుగంగ నీరు ఉండడంతో మాగాణి పొలాల్లో కూడా వరినాట్లు వేస్తున్నారు. నెల రోజుల పాటు వ్యవసాయ పనులు ఉంటాయి. , వరితో పాటు బావులు, బోర్ల కింద వేరుశనగ సాగుకు విత్తనాలను సిద్ధం చేసుకుంటున్నారు. ప్రభుత్వం సబ్సిడీపై ఎరువులను అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

–బుచ్చినాయుడుకండ్రిగ



తలారివెట్టు గ్రామంలో వరినారు పెరుకుతున్న కూలీలు, (ఇన్‌సెట్) కలివెట్టు గ్రామంలో దుక్కి దున్నుతున్న రైతు

పరశురామేశ్వరుడి సేవలో జేసీ


గుడిమల్లం ఆలయం వెలుపల జిల్లా జేసీ శుభం బన్సల్

ఏర్పేడు (రేణిగుంట): ఏర్పేడు మండలం గుడిమల్లం పరశురామేశ్వర స్వామి ఆలయాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం చేయించారు. దర్శనానంతరం ఆయనను పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈఓ రామచంద్ర రెడ్డి, మాజీ చైర్మన్ బత్తల గిరినాయుడు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

శ్రీకాళహస్తి: పట్టణంలోని బృందమ్మ కాలనీలో ఆదివారం రాత్రి వన్‌టౌన్ సీఐ గోపి ఆధ్వర్యంలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొత్తగా ఏర్పడిన చట్టాలు, సైబర్ నేరాలు, చిన్నపిల్లలు, మహిళల పట్ల జరిగే నేరాలపై వారికి అవగాహన కల్పించారు. అనంతరం పోలీసుశాఖ తరపున అక్కడ ఉన్న విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

ముక్కంటి క్షేత్రంలో భారీగా అర్చకుల బదిలీ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో కీలక స్థానాల్లో ఉన్న అర్చకులను ఆదివారం భారీ స్థాయిలో బదిలీ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. ప్రధాన ఆలయాలైన స్వామివారి ఆలయంలో రామకృష్ణను అమ్మవారి ఆలయానికి, విశ్వనాథ శర్మను నూతనంగా నియమించారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన రూ.500 రాహు-కేతు మండపాల్లో రఘు గురుకుల్, కార్తికేయ గురుకుల్, తులసీ రామశర్మ, కుమార్, గణేష్ శర్మ, మహేష్ స్వామి, చిన్నస్వామిని నియమించారు. అలాగే రూ.750 రాహు-కేతు మండపాలకు నరహరి లోకేష్ గురుకుల్‌ను, రూ.1500 రాహు-కేతు మండపాల్లో బాలసుబ్రమణ్యం, శ్రీనివాస గురుకుల్, దక్షిణామూర్తిని నియమించారు. శనీశ్వరుడి ఆలయం వద్ద గజానన శర్మ, రామకృష్ణను, దక్షిణామూర్తి ఆలయం వద్ద ఆనంద్, చంటిని నియమించారు. అర్చన విధులకు వెంకట సురేష్, చరణ్‌ను కేటాయించారు. చంగల్రాయ స్వామి ఆలయం వద్ద చిన్నస్వామి, ప్రధాన గణపతి వద్ద రామ్‌నాథ గురుకుల్, దుర్గమ్మ కొండమీద సురేష్‌ను నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇంత భారీస్థాయిలో అర్చకుల బదిలీ ఎప్పుడూ జరగలేదు. ఈ నెల రోజుల్లోనే నాలుగు సార్లు వివిధ విభాగాల్లో బదిలీలు చేశారు. అయితే ఈ బదిలీల సందర్భంగా భారీగా ముడుపులు చేతులు మారినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఉగ్రదాడి హేయమైన చర్య



వరదయ్యపాళెంలో కొవ్వొత్తులతో శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

వరదయ్యపాళెం: ఉగ్రదాడిని ఖండిస్తూ ఆదివారం రాత్రి వరదయ్యపాళెం మండల కేంద్రంలో ముస్లిం మైనారిటీలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సమీపంలోని పెద్ద మసీదు వద్ద ముస్లింలు, మతపెద్దలు కొవ్వొత్తులతో నిరసన తెలుపుతూ ఉగ్రవాదుల చర్యను తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదం నశించాలని కోరుతూ నినదించారు. ఉగ్రవాదుల చేతుల్లో మృతి చెందిన వారికి సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబాలకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు, మత పెద్దలు, గురువులు పాల్గొన్నారు.

చేతిబోరు ఏర్పాటుతో తీరిన సమస్య


పాండూరు హైస్కూల్‌లో జెడ్పీ నిధులతో ఏర్పాటు చేసిన చేతిబోరు

వరదయ్యపాళెం: మండలంలోని పాండూరు హైస్కూల్‌లో విద్యార్థుల కోసం జెడ్పీ నిధుల ద్వారా తాగునీటి చేతిబోరును ఏర్పాటు చేశారు. విద్యార్థులు తాగునీటి కోసం పడుతున్న ఇబ్బందుల గురించి స్థానిక ఎంపీటీసీ సామర్ల భువనేశ్వరి, జెడ్పీటీసీ వెంకటేశ్వర్ల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన జెడ్పీ నిధుల ద్వారా బోరు వేయించి చేతి పంపును అమర్చారు. దీనిపై ఎంపీటీసీ స్పందిస్తూ విద్యార్థుల తాగునీటి వసతి కల్పించేందుకు చేతిబోరు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విద్యార్థుల దాహార్తిపై స్పందించిన స్థానిక ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులకు పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు.

టూటౌన్ సీఐ బదిలీ

శ్రీకాళహస్తి: రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ వెంకటేశ్వర్లును వీఆర్‌కు పంపారు. ఆయన స్థానంలో పీలేరు సీఐ నాగార్జున రెడ్డిని నియమించారు. సోమవారం ఆయన విధుల్లో చేరనున్నారు.

అసంపూర్తిగా కాంబాకం రోడ్డు


మధ్యలో ఆగిపోయిన కాంబాకం రోడ్డు

వరదయ్యపాళెం: మండలంలోని వరదయ్యపాళెం నుంచి కాంబాకం గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో అటవీశాఖ అతిథి గృహం మలుపు నుంచి 500 మీటర్ల మేర రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా ఆగిపోయింది. గతంలో ఈ రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అయితే అటవీశాఖ అధికారుల అభ్యంతరం మేరకు నిర్మాణ పనులు ఆగిపోయాయి. అనంతరం అటవీశాఖ నుంచి అనుమతులు వచ్చే సమయానికి నిర్మాణ వ్యయం, వస్తుసామగ్రి ధరలు పెరగడంతో మంజూరైన నిధులు పూర్తిస్థాయి రోడ్డు నిర్మాణానికి సరిపోలేదు. దీంతో 500 మీటర్ల మేరకు రోడ్డు పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం కంకర తేలిన రోడ్డుపై స్థానికులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా వాహనదారులు కొన్ని సందర్భాల్లో ప్రమాదాలకు గురవుతూ ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది.

కూలర్ల వితరణ


కూలర్లను అందజేస్తున్న కొట్టే సాయి

శ్రీకాళహస్తి: హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు అభినందనీయమని జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి కొట్టే సాయి అన్నారు. ఆదివారం శ్రీకాళహస్తిలోని హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో సంస్థలో పని చేస్తున్న సభ్యులు, సిబ్బందికి వేసవితాపం నుంచి రక్షణ పొందే విధంగా కూలర్లను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి కొట్టేసాయి ముఖ్యఅతిథిగా పాల్గొని హెల్పింగ్ హాండ్స్ సభ్యుల కుటుంబీకులకు కూలర్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దాదాపు పదేళ్లుగా శ్రీకాళహస్తి పట్టణంలో హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ అధినేత మునీర్ బాషా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం వారి సంస్థలో పనిచేస్తున్న వారికి కూలర్లను వితరణ చేయడం హర్షించదగ్గ విషయం అంటూ ఆనందం వ్యక్తం చేశారు. హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థకు ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా తాము అందజేస్తామన్నారు. జనసేన నేతలు, హెల్పింగ్ హ్యాండ్స్ అన్సార్, గరికపాటి రమేష్, కోళ్ల హరి, బాబా ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా గ్రామోత్సవం


ఊరేగింపులో భాషికర్లు

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భాషికర్ల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం ఉత్సవమూర్తి మాడవీధుల్లో విహరిస్తూ హారతులు అందుకున్నారు. పది రోజుల పాటు సాయంత్రం భాషికర్ల మాడవీధి ఉత్సవం నిర్వహిస్తామని ఆలయ అధికారి నాగరాజు, ప్రధాన అర్చకులు శ్రీధర భట్టాచార్యులు తెలిపారు. ఉదయం ఆలయం తెరిచి నిత్య పూజాకైంకర్యాలను పూర్తి చేశారు. సాయంత్రం వైష్ణవ అద్వైత మత ప్రచారకులైన భాషికర్ల ఉత్సవమూర్తిని తిరుచ్చి వాహనంపై అధిష్ఠింప చేసి మాడవీధుల్లో విహరించారు. ఆలయానికి చేరుకున్న భాషికర్లకు ఆస్థానం నిర్వహించి నైవేద్య సమర్పణ చేశారు.

అగస్త్యేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు



నారాయణవనం: మండలంలోని సముదాయం గ్రామంలో టీటీడీ అనుబంధ మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు బుధవారం సాయంత్రం అంకురార్పణ, గురువారం ఉదయం ధ్వజారోహణంతో ప్రారంభమవుతాయని ఆలయ అర్చకులు రమేష్ గురుకల్, ఆలయ అధికారి నాగరాజు తెలిపారు. ఉదయం ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, సాయంత్రం సముదాయం గ్రామ వీధుల్లో వాహన ఊరేగింపు ఉంటుందని చెప్పారు. మే 1న గురువారం ఉదయం ధ్వజారోహణం, రాత్రి చంద్రప్రభవాహనం, 2న శుక్రవారం సాయంత్రం సింహవానం, 3న శనివారం హంసవాహనం, 4న ఆదివారం శేషవాహనం, 5న సోమవారం నంది వాహనం, 6న మంగళవారం గజవాహనంపై స్వామివారి ఉత్సవర్ల గ్రామోత్సవం ఉంటుందన్నారు. మే 7న బుధవారం రాత్రి రథోత్సవం, 8న గురువారం సాయంత్రం ఆర్జిత కల్యాణోత్సవం, రాత్రి అశ్వవాహన సేవ, 9న శుక్రవారం ఉదయం నటరాజ ఉత్సవం, సాయంత్రం రావణేశ్వర వాహనంపై స్వామి దర్శనమిస్తారు. 10న శనివారం ఉదయం త్రిశూల స్నానం అనంతరం సాయంత్రం ధ్వజావరోహణంతో ఉత్సవాలు ముగుస్తాయని, మే 8న గురువారం సాయంత్రం ఆర్జిత కల్యాణంలో రూ.500 చెల్లించి దంపతులు పాల్గొనవచ్చన్నారు.

జూన్ 11, 12న గంగజాతర

సత్యవేడు: జాతర నిర్వాహకులు ఆదివారం స్థానిక వీరభద్రస్వామి ఆలయంలో జూన్ 11, 12 తేదీల్లో నిర్వహించేలా గ్రామ పెద్దల కమిటీ నిర్ణయించింది. జాతర నిర్వహణలో భాగంగా మే 28న తొలిచాటింపు వేస్తారు. జూన్ 4న రెండో చాటింపు ఉంటుంది. ఆ రోజున గ్రామస్తులు పెద్దఎత్తున గంగమ్మ ఆలయం వద్ద అంబళ్లు పోస్తారు. అదే రోజు సదవాలయం గుడి వద్ద పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం నివేదిస్తారు.

నేటి నుంచి వేసవి శిబిరాలు

తిరుపతి అర్బన్: గ్రంథాయశాఖ వేసవి విజ్ఞాన శిబిరాలు సోమవారం నుంచి ప్రారంభించనున్నట్లు స్థానిక గోవిందరాజులస్వామి ఆలయ సమీపంలోని ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయాధికారి సూర్యనారాయణమూర్తి ఆదివారం తెలిపారు. 40 రోజుల నిర్వహించే ఈ శిబిరంలో పిల్లలకు కథలు వినిపించడం, పుస్తకాలు చదవడం, పుస్తక సమీక్షలు, కథలు చెప్పించడం, డ్రాయింగ్, క్విజ్ పోటీలు మొదలైనవి నిర్వహిస్తామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శాస్త్రోక్తంగా మహాకుంభాభిషేకం


యాగశాలలో హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

ఏర్పేడు (రేణిగుంట): ఏర్పేడు మండలం పాపానాయుడు పేటలో మఠ్రిమంద గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ హయగ్రీవ స్వామి ఆలయంలో జరుగుతున్న మహా కుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా రెండవ రోజు ఆదివారం యాగశాలలో వేద పండితులు కలశాలను ఏర్పాటు చేసి హోమాలు నిర్వహించారు. ఆలయంలో ప్రతిష్ఠించే విగ్రహాలకు, కలశాలకు పుణ్యాహవాచనం, పంచామృత అభిషేకం చేపట్టారు. ముందుగా ఆలయ ఆవరణలో జరిగిన మహా కలశపూజలో ఆలయ చైర్మన్ గిరిప్రసాద్ రెడ్డి, స్థానిక నేతలు పాల్గొన్నారు. మంగళ వాయిద్యాల నడుమ యాగశాలలో వేద పండితులు శాస్త్రోక్తంగా హోమం నిర్వహించారు. ప్రధాన ఆలయానికి అనుసంధానంగా గ్రామ దేవతగా విరాజిల్లుతున్న మఠ్రిమంద బంగారమ్మ, శ్రీవాంఛ కల్పలత గణపతి, శ్రీవైద్యనాథ సుబ్రహ్మణ్య స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. హోమం విశిష్టతను అర్చకులు వివరించారు. మహా కుంభాభిషేకం చివరిరోజు వరకు హోమం నిర్విరామంగా వెలుగుతూనే ఉంటుందని అర్చకులు తెలిపారు. సాయంత్రం అగ్నిరాధన పూజ చేపట్టారు. అనంతరం హరికథా గానం, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ధనుంజయుల నాయుడు, నాగరాజు నాయుడు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పరామర్శ

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం గుండ్లకండ్రిగ గ్రామానికి చెందిన కలవగుంట నర్మద ఆదివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుటుంబ సభ్యులు సామాను అనసూయమ్మ అక్కడికి చేరుకున్నారు. మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.


నర్మద కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సామాను అనసూయమ్మ

కోనో కార్పస్ మొక్కలు హానికరం కాదు..



సమావేశంలో మాట్లాడుతున్న పర్యావరణవేత్త ప్రొఫెసర్ బయ్యపురెడ్డి

తిరుపతి కల్చరల్: తెలుగు రాష్ట్రాల్లో కోనో కార్పస్ మొక్కలు పర్యావరణానికి, ఆరోగ్యానికి హానికరమంటూ ప్రజల్లో భయాందోళనలు రేకెత్తించడానికి స్వస్తి పలికి, బహుళ ప్రయోజనాలున్న ఆ మొక్కలను రక్షించాలని ప్రముఖ పర్యావరణవేత్త, ఆచార్య నాగార్జున వర్సిటీ పూర్వ వృక్షశాస్త్ర ప్రొఫెసర్ కె.బయ్యపురెడ్డి విజ్ఞప్తి చేశారు. జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో కోనో కార్పస్ మొక్కలపై మీడియాతో జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి అధ్యక్షతన ముఖాముఖి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కోనో కార్పస్ మొక్క ప్రపంచంలో మొదట యెమెన్ దేశంలో సహజ సిద్ధంగా పెరుగుతూ ప్రపంచంలో అత్యధిక దేశాలకు విస్తరించిందన్నారు. గల్ఫ్ దేశాలలో నీరు లభించకపోయినా కోనో కార్పస్ మొక్కలు ఆయా దేశాల మొక్కలలో 70 శాతానికిపైగా పెరిగి పచ్చదనాన్ని అందిస్తున్నాయన్నారు. ఈ మొక్కలు వాతావరణంలోని కార్బన్ డయాక్సైడ్‌ను అత్యధికంగా తీసుకుంటూ అత్యధిక ఆక్సిజన్‌ను ఈ చెట్టు ఇస్తుందని పేర్కొన్నారు. వాయు, ధ్వని కాలుష్యాల నుంచి ప్రజలను ఈ మొక్కలు రక్షిస్తాయన్నారు. ఈ చెట్ల వల్ల ఏ ఆరోగ్య సమస్యలూ తలెత్తవని స్పష్టంచేశారు. బెంగుళూరులోని అంతర్జాతీయ విద్యాసంస్థలు వేలాది కోనో కార్పస్ మొక్కలతో నిండి ఉన్నాయని, అక్కడ ఏ ఒక్క విద్యార్థికి ఆస్తమా, అలర్జీ సమస్యలు రాలేదంటూ ఆ మొక్కల ప్రయోజనాలను గురించి దృశ్య మాధ్యమం ద్వారా వివరించారు. జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ, కోనో కార్పస్‌పై అపోహలను తొలగించి వాటి ప్రయోజనాలను వివరించేందుకు తెలుగు రాష్ట్రాల్లో సదస్సు, చర్చాగోష్ఠులు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో ఏపీకౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పూర్వ కార్యదర్శి, జియాలజీ ప్రొఫెసర్ టీవీ.కృష్ణారెడ్డి, ఆలిండియా నేషనల్ బీసీ ఫ్రంట్ కన్వీనర్ కెఎంఎల్. నరసింహ పాల్గొన్నారు.